**"ఏమండీ, మనం కూడా కేబుల్ పెట్టించుకుందామా?" అన్నాను ... ఆయన వాలు కుర్చీలో జార్లబడి రెండోసారి దినపత్రిక చదువుతున్న సమయం చూసి. ఆయన పలుకలేదు. వినిపించిందో లేదో, వినిపించనట్లు నటిస్తున్నారో, ఎందుకైనా మంచిదని రెట్టించాను.**

ముఖానికి అడ్డంగా పెట్టుకున్న పేపరు పక్కకి జరపనైనా జరపకుండా, "ఏం, పక్కింటి పార్వతమ్మగారు కేబుల్ పెట్టించుకున్నారా?" అన్నారు. గొంతు అమాయకంగా ధ్వనించినా, అందులోని వెటకారం నాకు అర్థం కాకపోలేదు.

"అబ్బే! మీ కొలీగ్ కొండలరావుగారు పెట్టించుకున్నారని కబురొచ్చింది!" అన్నాను.

నీవు నేర్పిన విద్యయే నీరజాక్ష!

## అబ్బూరి ఛాయాదేవి

# ఏ రాయి అయితేనేం?



ఈసారి పేపరు పక్కకి జరిపి, నాకేసి సూటిగా చూస్తూ, "కిందటి సారి ఏమన్నావ్?" అన్నారు నిలదీస్తున్నట్లు.

"కిందటిసారి అంటే ...?" అన్నాను సందేహంగా.

"రంగుల టీ.వి. కొనుక్కుందామన్నప్పుడు ఏమన్నావో గుర్తు లేదూ? ... మళ్లీ ఇంకెప్పుడూ ఏదీ అడగనండీ, ఈ ఒక్కటీ ... అంటూ బతిమాలలేదూ" అన్నారు.

"అంతగా బతిమాలితేగాని ఏదీ కొనరుగా మరి!" అన్నాను సమర్థించుకుంటూ.

"ప్రతిసారీ ఇలా వెంటబడి బతిమాలే నెగ్గించుకుంటున్నావ్!" అన్నారు దెప్పుతున్నట్లు.

"అవును మరి, ఆర్డరివ్వడానికి మీ 'బాస్' ని కాదు కదా!" అన్నాను.

"అయినా ఇప్పుడు కేబుల్ లేకపోతే ఏం?" అన్నారు.

అమ్మయ్య! కాస్త మెత్తబడ్డారు లెమ్మని ధైర్యం తెచ్చుకుని, "బోలెడు మంచి సీరియల్స్ వస్తున్నాయని అందరూ చెబుతున్నారండీ" అన్నాను.

"ఉన్నవి చూడ్డానికే నీకు టైమ్ సరిపోవడం లేదు కదా! పైగా ఈ టీ.వి. వచ్చాక రేడియో వినడం తగ్గించేశావు, పుస్తకాలు చదవడం తగ్గించేశావు. నా సంగతి కూడా పట్టించుకోవడంలేదు. పగలూ రాత్రీ అంటూ లేదు. ఆదివారాలు అంటూ లేవు .. ఎప్పుడూ ఆ టి.వి. ముందు కూచుంటే ఇంట్లో పనులు సరిగ్గా సాగకపోవడం, నీ కళ్లు పాడవటమూనూ. ఉన్నదాంతో తృప్తి పడటం నేర్చుకోవాలి గాని, చిన్నపిల్లలా చూసిందల్లా కావాలంటే ఎలా?" అన్నారాయన.

"అందరూ పంచ భక్ష్య పరమాన్నాలతో భోం చేస్తుంటే మనం పండగొచ్చినా పబ్బమొచ్చినా మామూలు భోజనమే చేస్తున్నట్లుగా ఉంది. ఎంత మంచి మంచి కార్యక్రమాలొస్తున్నాయో! ఎన్ని మంచి సీరియల్స్ వస్తున్నాయో! అందరూ గొప్పగా చెప్పుకుంటూంటే నేను వింటూ వెర్రిమొహం వేసుక్కూర్చోవాల్సి వస్తోంది" అన్నాను ఉడుకు మోత్తనంతో.

"అదుగో! ఆ పోటీ మనస్తత్వమే మంచిది కాదు. లేనిపోని కోరికలన్నీ పుట్టుకొస్తాయి. వాటితోపాటే దురాశలూ, నిరాశలూ! అందుకే కోరికల్ని త్యజించమన్నారు ఋషులు. అసలు, కోరికే దుఃఖానికి హేతువు అన్నాడు బుద్ధుడు. కోరికని అవగాహన చేసుకోమన్నాడు జె.కె. అసలు కోరిక..." అంటూంటే, ఆయన మాటలికి అడ్డొస్తూ.

"అబ్బ! ప్రతిదానికీ వేదాంతాన్ని బోధించకండి- కోరికల్ని చంపుకోమంటూ. జీవితం మీద విరక్తి పుడుతుంది కూడానూ!" అన్నాను.

"కోరికల్ని చంపుకోమనడం లేదు. అసలు కోరికల్ని పుట్టించడం దేనికి? కోరికలు ఎలా పుడుతున్నాయో ఎప్పుడైనా గమనించావా? నీ మనస్సులో ఎటువంటి ఆలోచనలు ఏయే సందర్భాల్లో బయలుదేరుతున్నాయో ఎప్పుడైనా గమనించావా? ఇవి మంచి ఆలోచనలు, ఇవి చెడ్డ ఆలోచనలు అని ముందే నిర్ణయాలకు రాకుండా, ఉదాసీనంగా గమనిస్తూ వాటిని తెలుసుకోవడానికి ఎప్పుడైనా ప్రయత్నించావా? ఎన్నిసార్లు చెప్పినా అలాచేసి చూడవేం? ఇప్పుడు ప్రయత్నించు ... ఒక కోరిక ఎన్ని రకాల కోరికలకి దారితీస్తుందో, ఒక కోరిక తీరగానే దానిమీద మోజు తీరిపోయి మరో కోరిక ఎలా పుడుతుందో, ఉన్న స్థితి మీద ఎందుకు ఆసక్తి కలగడం లేదో, ఉన్న దానిమీద ఎందుకు శ్రద్ధ ఉండటం లేదో, మనస్సు పరిపరివిధాల ఆకర్షణలకు ఎలా గురి అవుతుందో నువ్వే తెలుసుకుంటావు" అన్నారు.




ఏదైనా కొనడం ఇష్టం లేనప్పుడూ, ఖర్చుపెట్టడం ఇష్టం లేనప్పుడూ ఇలాగే డొంక తిరుగుడుగా ఉపన్యాసాలిస్తూంటారు. ఆ తత్త్వబోధకి నాకు ఒళ్లుమండి, ఇక లాభం లేదని నోరు మూసుక్కూర్చున్నాను. నేను ధ్యానం చేసుకుంటున్నాననుకున్నారేమో! వాలు కుర్చీలో నడుంవాల్చి, మళ్లీ పేపరు ముఖానికి అడ్డంగా పెట్టుకున్నారు.

ఈయన ఎప్పుడూ అంతే. నాలో కోరికలు ఉప్పొంగుతూంటే చన్నీళ్లు చల్లేస్తారు. ఒకసారి, ఒక టి.వి. ప్రోగ్రాం వాళ్లు ఇచ్చిన ప్రశ్నకి నేను సరియైన సమాధానం రాసినందుకు లాటరీలో నాకు మొదటి బహుమతి వచ్చింది. అంటే, సరియైన సమాధానం రాసిన వాళ్లలో నాకే బహుమతి వచ్చింది. అమృత్‌సర్‌కి రెండు ఫస్టు క్లాసు టిక్కెట్లు ... రానూ పోనూ... నేను ఎగిరి గంతేసాను. నాకు కొత్త కొత్త ప్రదేశాలు చూడ్డం అంటే చాలా ఇష్టం. ఎప్పుడూ అవకాశాలే రావు. అలాంటిది అంత అనాయాసంగా అక్కడి స్వర్ణ దేవాలయాన్ని దర్శించే అవకాశం కలుగుతున్నందుకు గర్వంగా కూడా అనిపించింది. కానీ, ఆయన సొడ్డు వెయ్యనే వేశారు. "టిక్కెట్లు దొరికితే సరిపోయిందా? అక్కడ హోటల్లో ఉండటానికీ, ఇతర సదుపాయాలకీ బోలెడవుతుంది. అసలే చలికాలం. దానికోసం స్వెట్టర్లూ సాక్సూ కొనుక్కోవడం, ఇంటికొచ్చాక మూలపడ్డం ... ఎందుకొచ్చిన బాధ! తీరికూర్చుని ఎందుకు ఆ ఖర్చులూ, ప్రయాసా? అవన్నీ చూడాలనే కోరిక లేకపోతే ఏ బాధా ఉండదు కదా!" అని కొట్టి పారేశారు. నా ప్రాణం ఉసూరుమంది.

గుయ్ మంటూ బెల్లు మోగింది. పరధ్యానంలో ఉండటంవల్ల నా గుండె ఝల్లుమంది. మెల్లిగా లేచి వెళ్లి తలుపుతీశాను. ఎదురుగా ఎవరూ కనిపించలేదు. పక్కకి తిరిగి చూస్తే కిటికీ దగ్గరున్న పోస్ట్ బాక్స్‌లో కాగితం కనిపించింది. తీసి చూశాను. ఎలక్ట్రిసిటీ బిల్లు పట్టుకెళ్లి ఆయనచేతికిచ్చాను.

విప్పిచూసి, "చూడు, ఎంతొచ్చిందో!" అన్నారు ... ఆ షాక్ నాక్కూడా తగలాలని. నేను ముట్టుకోలేదు.

"కిందటిసారికన్నా రెండొందలు పెరిగింది తెలుసా?!" అని గాండ్రించారు.

నేను మౌనం వహించాను... లేకపోతే ఇంకా రెచ్చిపోతారని. ప్రభుత్వం చేసిన దానికి మధ్య నామీద ఎగురుతారు ఎందుకో!

అయినా ఆయన ఊరుకోలేదు...

"పనిమనిషి చీటికీ మాటికీ నాగాలు పెడుతోంది, బట్టలు ఉతుక్కోలేకపోతున్నాను, వాషింగ్ మెషీన్ కొనండీ అని బతిమాలితే, పోనీ కదా అని అప్పో సప్పో చేసి కొన్నాను కదా... వేణ్ణీళ్లు కాస్తూంటే గ్యాస్ బోలెడైపోతోంది. గ్యాస్ బిల్లు కూడా పెరిగిపోయింది ... గౌరి గారూ వాళ్లూ గీజర్ కొనుక్కోమన్నారు. మనం కూడా కొనుక్కుందామండీ, గ్యాస్ కలిసొస్తుంది అని గోలపెడితే సరే కదా అని గీజర్ కొన్నాను. తరువాత ఎలక్ట్రిక్ స్యూయింగ్ మెషీను ... టి.వి.లో చూపించే ప్రతి వ్యాపార ప్రకటనా చూడ్డం, అవి కొనమని నా వెంటపడ్డం .. ఈ గ్లోబలైజేషన్‌తో నా కొంప గుండం అయేట్టుంది" అంటూ విరుచుకు పడ్డారు.

ఈ మధ్య ప్రతి దానికీ 'గ్లోబలైజేషన్' అంటూ నా మీద విసుక్కుంటున్నారు. షాంపూ సీసా కొనమన్నా, కొత్తగా వచ్చిన మేలురకం కోల్డ్‌క్రీమ్ తెమ్మన్నా విసుక్కుంటున్నారు. ప్రపంచసుందరి పోటీల్లో మన వాళ్లకి కిరీటాలు పెట్టడం ... వాళ్ల అందాలకి మూర్ఛపోయి కాదు. మన మార్కెట్‌ని దోచుకోవడానికే ... అంటారాయన. నాలాంటి వెర్రిబాగుల వాళ్లు ఉండబట్టే, అగ్రరాజ్యాల వాళ్ల ఆటలు సాగుతున్నాయట. నేను ఎంతసేపూ ఆ టి.వి. పట్టుకుని వదలనుట.

వాతావరణం సుముఖంగా లేదని గ్రహించి, కాఫీ పెట్టడానికి వంటింట్లోకి వెడదామని లేచాను. ఇంతలో టెలిఫోన్ మోగింది. ఫోన్ చేసినది మా చెల్లెలు. అది మాట్లాడ్డం మొదలుపెడితే, ఫోన్ పట్టుకున్న చెయ్యి తిమ్మిరెక్కేవరకూ ఆపదు. మధ్యలో నేను ఏదైనా మాట్లాడబోతే, "చెప్పేది పూర్తిగా విను, మధ్య మధ్యలో బ్రేక్ వెయ్యకు" అంటుంది. మౌనంగా వింటూంటే, "వింటున్నావా?" అని హెచ్చరిస్తుంది. "ఆఁ" అంటే, 'ఊఁ' అన్నా అనవేం?" అంటుంది. 'ఊఁ ఊఁ' అంటూంటే మూలుగుతున్నట్లు అనిపిస్తుంది నాకు. ఇంకా నయం, వంటింట్లోకి వెళ్లి పొయ్యిమీద నీళ్ల గిన్నె పెట్టాక ఫోన్ మోగలేదు, ఆ నీళ్లన్నీ మరిగిపోయి ఉండేవి. నాకసలే మతిమరుపు ఎక్కువ.



ఫోన్‌లో నేను 'హలో' అనగానే నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పింది. "మీకిద్దరికీ కూడా..." అన్నాను.

"ఫోన్ బిల్లు ఎక్కువవుతోంది ఈ మధ్య. పెట్టేస్తున్నాను" అని ఠక్కున పెట్టేసింది. ఇదివరకు నేను ఎన్నోసార్లు హెచ్చరించాను దాన్ని ... ఫోన్‌లో అంతంత సేపు మాట్లాడితే, ఈలోగా ఎవరైనా ఫోన్ చేస్తే చెడిపోయిందనుకుంటారు, బిల్లు సంగతి సరే సరి అని. కానీ కలుసుకుని 'కబుర్లు చెప్పుకోవాలంటే చీటికీ మాటికీ కుదరదు కదా, బోలెడు దూరంలో ఉన్నాం బస్సులో ప్రయాణం చేసే ఓపికలేదు, ఆటోలకి బోలెడు ఖర్చు, ఫరవాలేదులే, ఆటో మీద ఖర్చుకంటే ఫోన్‌లో మాట్లాడుకుంటే నయం కదా... అనేది. ఇప్పుడు వెనక నుయ్యి, ముందు గొయ్యి అన్నట్లుగా ఉంది పరిస్థితి.

అందుకేనేమో పాపం, మా ఆయన వేదాంతం పేరుతోనో, గ్లోబలైజేషన్ పేరుతోనో కోరికల్ని చంపేసుకోమంటారు... కాదు కాదు ... కోరికలు పుట్టకుండా చూసుకోమంటారు. అలాగని, అవి పుట్టకుండా బలవంతంగా నిరోధించడం కాదుట ... ఉన్న స్థితిని అవగాహన చేసుకుంటే, అవే పుట్టకుండా ఉంటాయట. ఒకవేళ పుడితే, వాటిని పోషించే స్తోమత మాకులేదని వాటికీ అర్థమవుతుందన్న మాట!

ఇటు వేదాంతం ఒంటబట్టించుకోవడమో, అటు ఆర్థిక పరిస్థితిని అవగాహన చేసుకోవడమో ... 'ఏ రాయి అయితేనేం పళ్లూడకొట్టుకోవడానికి' అన్నట్లు! ... ఇంతకీ ఆ కేబుల్ని నా మనసులోంచి పీకేసేది ఏదయితేనేం?!

**(ఆలిండియా రేడియో, హైదరాబాద్ సౌజన్యంతో)**

**ప్రేమసూత్రాలూ... బామ్మా!**

మోడల్‌గా వుండి బాలీవుడ్‌లోకి వచ్చిన మిలింద్ సోమన్ ఇప్పుడు నిర్మాత కూడా అయ్యాడు. చిత్రం పేరు 'రూల్స్.' ఇందులో నాయికలు, దర్శకురాలు, యూనిట్టంతా కూడా కొత్తవాళ్లేనట. హీరోయిన్ మీరావాసుదేవన్, హీరో మిలింద్‌ను తన వైపు ఆకర్షించుకోవాలనుకుంటుంది కానీ, ఎలాగో ఆమెకు తోచదు. అప్పుడామె బామ్మ తనూజ, ప్రేమలో సూపర్ హిట్ ఫార్ములాలు చెబుతుందట. కథలకు కొరతగా వున్న ఈ రోజుల్లో, చక్కని కథ వుంటే కొత్తవాళ్లయినా ప్రేక్షకులు ఆదరిస్తారంటున్నాడు మిలింద్ ఆత్మవిశ్వాసంతో.